# అనుబంధం

నీరజకి పూలజడ వేసి బుగ్గ చిదిమి ముద్దు పెట్టుకుంది కాత్యాయని, "నువ్వు చాలా అదృష్టవంతురాలివే నీరూ!" అంటూ.

"ఏదీ! అల్లరిపిల్ల నోటికి కళ్లెం పడింది. వారం రోజుల్నించి పెదవి కదిపితేనా అసలు!" శార్వాణి పరిహాసిస్తూ ఆడపడుచు అలంకరణ పూర్తి చేసింది.

అక్క, వదినా చెరో చెయ్యీ పుచ్చుకుని నిలువుటద్దం ముందుకు లాక్కెళ్లారు నీరజని. అక్క జారుతున్న చెంగు సర్దుతూంటే వదిన కుచ్చిళ్లు సవరిస్తోంది.

"మన నీరూ ఎంత అదృష్టం చేసుకుందో! దసరాపండగల్లో ఈ శుభకార్యం జరిగింది!" కాత్యాయని చెల్లెలి మెళ్లో మంగళసూత్రాలు చూస్తూ అంది.

"అది కాదమ్మా అదృష్టం అంటే, ఇదిగో! ఇప్పుడుంది అసలు అదృష్టం! చూశావూ! ఇలా... అతను..." కొంటెగా చిన్నారి ఆడపడుచుని పెనవేసుకుంది.

అక్క, వదినల పరిహాసాలు నీరజ చెవుల్లో పెద్ద ఉరుముల్లా ధ్వనిస్తున్నాయి. ఇక కాసేపట్లో జరగబోయే తుపానుకి తానెలా తట్టుకోగలదు? ఏమిటీ సంకట స్థితి? తానెందుకిలా తలవంచేసింది? మరబొమ్మలా వీళ్లంతా ఆడించినట్లాడింది.

బైటకి రాకుండా బలవంతంగా ఆపుకుంటున్న కన్నీళ్లతో ఆమె కళ్ళు బరువెక్కాయి: వర్షించ డానికి సిద్ధంగా ఉన్న మేఘాల్లాగా. ఆ మేఘాలే తనకంటె ఎక్కువ అదృష్టం చేసుకున్నాయి.తమలో ఉన్న నీళ్లని కురిపించి తేలికపడిపోతాయి. దానివల్ల అందరికీ ఉపకారమే. అయినా వాటికి దేంతోనూ ప్రమేయమే లేదు. తనకళ్ళు వర్షించని మేఘాలు. ఈబరువు లోలోపల దాచుకోవల్సిందే!

నీరజ ఆవేదనకి బిడియం అనీ, ఆమె మనస్తాపానికి 'శోభనపు పెళ్ళికూతురుకుండే సహజమైన బెదురు' అనీ అనుకున్న అక్క, వదిన: నీరజను లోపలకు పంపి 'ఆనందాన్ని చవిచూడు'మన్నట్లు తలుపు మూశారు వెనకనించి.

ఎదనిండా వేలవేల తీయని తలపులతో, కళ్లల్లో కమ్మని వలపు చూపుల్తో ఎదురుచూస్తున్నాడు దివాకర్ బెడ్ మీద. నీరజను చూడగానే అతని గుండెలు పులకించిపోయాయి.

'ఈ అపరంజిబొమ్మ తనదే ఇక! ఎన్నాళ్లుగా తను ఈ మధురక్షణాలకోసం తహతహ లాడాడు! బ్రతుకులో ప్రణయాన్ని పండించుకునే మొదటి రాత్రి ఎంత మధురం! వివాహబంధానికి నిజమైన అనుబంధాన్నిచ్చేదీ తరుణం!..'

నీరజని అతని చూపులు పెనవేసుకుంటున్నాయి. ఆమె అందం అతన్ని నిలువెల్లా గిలిగింతలు పెడుతోంది. తలుపునానుకుని తలవంచుకుని పాలరాతిబొమ్మలా నిలబడ్డ నీరజని చేరువకమ్మని పిలుస్తున్నాయి ఆ...చూపులు..మరీ ఇంత బిడియం అయితే ఎలా! ఎంత చదువుకున్నా, ఉద్యోగం చేస్తున్నా ఆడపిల్లకు ఈ...సమయంలో సిగ్గు ముంచుకొస్తుంది గావుల్ను. కానీ... మధురక్షణాలు కరిగిపోతున్నాయే!

దివాకర్ మనసు నిలవడం లేదు. చప్పున మంచం దిగి మృదువుగా నీరజని సమీపించాడు. నీరజ అదిరిపాటుతో కొద్దిగా పక్కకి తప్పుకుంది.

ప్రొద్దున్నించీ ఈ క్షణం ఆమెను భయపెడుతూనే ఉంది. ఇప్పుడెదురయితే వణుకొచ్చింది నీరజకి.

"మరీ ఇంత సిగ్గా!... నీరజా" ఆమె చేయినందుకుని మృదువుగా చెవిలో అన్నాడు దివాకర్. కంపిస్తున్న ఆమెను దగ్గరకు తీసుకుని హృదయానికి హత్తుకున్నాడు.

నీరజకు కాళ్ళక్రింద భూమి కంపిస్తున్నట్లనిపించింది. జరగరానిదేదో... జరుగుతున్నట్లు.... తనబ్రతుకు పతనమైపోతున్నట్లు!

అలా కావడానికి వీల్లేదు. దీనికి తను అంగీకరించలేదు. ఇక తనలో తెగింపు రావాలి...

మరుక్షణం అతని కౌగిలిని విదిలించుకుని విడిపడింది. దివాకర్‌కి తనేమీ కాకూడదు.

"పెళ్ళి నిశ్చయమైనప్పట్నించీ ఈ తెగింపు రావాలని చూస్తోంది. ఇతడు తనని మంగళసూత్రంతో బంధించేశాడు... ఇంకా ఊరుకుంటే... ఇంకా ఊరుకుంటే... ఇంకా లాగేస్తాడు. అలా జరగడానికి వీల్లేదు. ఓమూల జరిగి కూర్చుంది తన అయిష్టతని వ్యక్తం చేస్తూ...

దివాకర్ స్టన్ అయ్యాడు నీరజ ప్రవర్తనకి.

తను ఊహించింది తారుమారయ్యేసరికి దివాకర్ అహం దెబ్బతింది. తొలిరేయి తనువంతా వలపువిరుల పులకింతలతో ప్రణయసుమాలు పూసే నీరజని పెనవేసుకుని కలలన్నీ విరియించుకోవాలని... ఆశించిన తనకేమిటీ స్థితి ఎదురయ్యింది? అసలామె మనస్సులో ఏముందో తనకెలా తెలుస్తుంది?

పెళ్ళిచూపుల్లో ఈ అందాలరాశిని చూడగానే తనని తాను అర్పించుకున్నాడామెకు. ఈమెతో జీవనమాధుర్యాన్ని పంచుకోవాలని ఎన్నో కలలు కన్నాడు. ఈ బంగారు బొమ్మ తన ఇల్లాలైతే తనెంత అదృష్టవంతుడో అనుకున్నాడు. వెంటనే తనకిష్టమని తెలియజేశాడు. ఆక్షణాన్నే తన మనస్సులో నీరజ రూపం ముద్రించుకుపోయింది. తన వంటరితనం అప్పుడే మాయమైంది. ఎన్నో కలలు కన్నాడు. ఆమెతో షికార్లు, సినిమాలు, ఎన్నెన్నో ముచ్చట్లు అప్పుడే అనుభవించేశాడు.

'ఇదేంటి? నీరజకి నిజంగా తనంటే ఇష్టం లేదా? ఆ విషయం అప్పుడే ఎందుకు చెప్పలేదు?

తనేం బలవంతంగా పెళ్లి చేసుకోలేదే!'

కలలు చెదిరిపోతున్నాయి. ఊహలు ఉరులు పోసుకుంటున్నాయి. ఇక భరించలేక పోతున్నాడు. నీరజలో ఏముందో తెలుసుకోవాలి. దివాకర్ ముఖం గంభీరంగా మారిపోయింది. కోటికోరికలు దాచుకున్న ఆకళ్ళలో ఒక్కసారి చెప్పలేనంత నిరాశ...

"నీరజా!" గంభీరంగా ఉన్న పిలుపుకి తృళ్ళిపడి నిలబడ్డ ఆమెను తీక్షణంగా చూశాడు.

"నీ ధోరణి నాకేం అర్థం కావడం లేదు. ఎందుకిలా నాకు దూరం కావాలని చూస్తున్నావు?" నీరజ కళ్ళు వాల్చేసుకుంది.

ఆమెలోని ఆలోచనలేమిటో కనుక్కోలేని దివాకర్ మరింత నెమ్మదిగా "చూడు నీరజా! మనకిది మధురమైన రోజు. జీవితాంతం తీయని గుర్తుగా మిగలాల్సిన ఈ రాత్రిని ఇలా ఎందుకు చేస్తున్నావో నాకర్థం కావడం లేదు. సిగ్గా, నేనంటే? ఇక ఇంకేమైనా కారణాలుంటే చెప్పు! భయం లేదు!"

నీరజ గుండె వేగంగా కొట్టుకోసాగింది. దుఃఖాన్ని ఆపుకోలేకపోతోంది. కళ్లల్లో నీళ్ల తిరిగాయి. నీరజ తడబాటుతో అస్పష్టంగా అంటున్నదేమిటో దివాకర్‌కి అర్థం కాలేదు.

"సరిగా చెప్పు నీరజా! నీకీ పెళ్లి ఇష్టం లేదా? సూటిగా అడుగుతున్నా!" దివాకర్ గొంతు బొంగురుపోయింది.

"మీరేదైనా అనుకోండి. ప్రస్తుతానికి నన్ను నా మానాన వదిలెయ్యండి ప్లీజ్...!" కళ్ల తుడుచుకుంటూ ఎలాగో చెప్పేసిందా నాలుగు మాటలు.

దివాకర్ ఆమె దగ్గరగా వెళ్లి కళ్ల తుడుస్తూ "ఊరుకో నీరజా! నాకు పెళ్లిమీద ఉన్న అభిప్రాయంతో నిన్నలా అనుకున్నాను. ఏక్షణాన నీమెళ్లో మంగళసూత్రం కట్టానో అప్పట్నించే నిన్ను నాదేవతగా ఆరాధించుకుంటున్నాను. నీలో ఉన్న ఆవేదన ఏంటో నాకు తెలియకపోయినా.. నువ్వు దుఃఖిస్తూంటే చూడలేను." అనేసి పక్కనున్న సోఫాలో కూలబడ్డాడు.

నీరజ మంచంమీద దిండులో ముఖం దాచుకుంది.

ఒక్కటై గడపవలసిన జంట. వేరైపోయింది. ఆరెండు మనస్సులు ఆవేదనతో సెగలు కక్కాయి.

తనకిష్టం లేకుండా ముందుకు అడుగువెయ్యడని ధైర్యం తెచ్చుకుని దివాకర్ మంచితనాన్ని మనసులోనే అభినందించుకుంది నీరజ. ఆమె మంచం మీదా, అతడు సోఫాలోనూ..

తెలతెలవారింది.

"ప్లీజ్! ఒక్కమాట!" అన్న నీరజ పిలుపుకి ఉలిక్కిపడి లేచాడు దివాకర్.

అతనివైపు కాకుండా క్రిందకి చూస్తూ " రాత్రి సంగతి మన మధ్యనే ఉండనివ్వండి. ఈ రెండ్రోజులూ కూడా ఇలానే గడిపేద్దాం! తర్వాత సంగతి.."

"ఇదేంటి నీరజా! నీప్రవర్తన నాకేం అర్థం కావడం లేదు. నువ్విలా ఎందుకు మారావు? ఏమిటిదంతా?'

"ప్లీజ్! ఇప్పుడే నేనేం చెప్పే స్థితిలో లేను. నన్నిలా ఉండనివ్వండి. నాకీ అవకాశం ఇవ్వండి ప్లీజ్!" అంది వణకుతూ. తలుపులు తెరుచుకుని బైటకి నడిచింది రివ్వున: పంజరం తలుపు తెరుచుకున్న చిలకలా.

మూడు రాత్రుళ్లూ అలానే గడిచాయి. దివాకర్ ఈ రహస్యాన్ని బైటపెట్టి ఏం రట్టు చేస్తాడో అని క్షణక్షణం భయపడ్డ నీరజ అతని ప్రవర్తనకి ఆశ్చర్యపడింది.

తను ఎంత తప్పించుకు తిరిగినా నలుగుర్లో తటస్థపడినప్పుడు తనతో నవ్వుతూ మాట్లాడ్డం, తనిచ్చిన కాఫీ, ఉప్మాలు ఎంతో అప్యాయంగా అందుకోవడం. పెద్దవాళ్లతో గుడికెళ్లినప్పుడూ. పిల్లలతో బీచ్కెళ్లినప్పుడూ హాస్యంగా మాట్లాడుతూ అప్పుడప్పుడు మృదువుగా చెయ్యి నొక్కాడు. ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రం తన కోరికను మన్నించాడు. ఎంత ఉత్తముడు.

ఆ ఆలోచనలకి ఆమె కళ్లు చెమర్చాయి.

ఇక ఆ ఊరినించి బైల్దేరే సమయం వచ్చింది. తనకి ఆఫీసులో పనెక్కువగా ఉండి సెలవు దొరకలేదని వంకపెట్టి ఓరోజు ముందుగా బైల్దేరేసింది నీరజ.

పెట్టెలు సర్దేసుకోవడం అయ్యాక ఒంటరిగా ఉన్నప్పుడు

"వెళతాను మరి! నాకు మీరెంతో మేలు చేశారు. మీ ఋణం తీర్చుకోలేనిది..." నీళ్లు నిండిన కళ్లతో... అంది నీరజ.

"నీరజా! నీ మనసులో ఏముందో తెలియదు. ఇష్టంలేని పెళ్లి చేసుకుని నన్ను ఇంత ఇబ్బంది ఎందుకు పెట్టావో అర్థం కావడం లేదు. అయినా నాకు వివాహబంధంపై విశ్వాసం ఎక్కువ. మాంగల్యబంధం స్వర్గంలోనే వేయబడుతుందని గుడ్డిగా నమ్మేవాణ్ణి. నేను నిన్నెప్పుడూ నాదాన్నిగానే హృదయంలో దాచుకుంటాను. ఎప్పుడు నీ మనసు మారి మనింటికి వచ్చినా. నీకోసం మనిల్లు, నా హృదయం ఎప్పుడూ తెరిచే ఉంటాయి. అందుకే, వెళ్లివస్తాను అను ప్లీజ్!"

నోటమాట రాని నీరజ బైటకు నడిచింది టాక్సీ ఎక్కడానికి.

ట్రైన్లో కూర్చున్నాక నీరజ తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. ఇక ఆ తంతు అంతా మరిచిపోవాలి. దివాకర్లో ఉన్న మంచితనం వల్లనో, తన మొండితనం వల్లనో తన శరీరాన్ని కళంకం రాకుండా కాపాడుకోగలిగింది. అది ఎప్పటికీ తను మనసిచ్చిన సుధాకర్దే! మనసు, తనువు, బ్రతుకు సర్వస్వం తన సుధకే అంకితం.

**అనుబంధం**

ఎంత తీయని పేరు! మరీ సుందరమైన రూపం కూడా! సుధ అంటే తనకి ప్రాణం. అతనికోసం ఏం చెయ్యమన్నా చేస్తుంది. ఒక్కసారి కూడా సుధాకర్ మాటని తను కాదనలేదింతవరకు. హైద్రాబాదు వెళ్లగానే తన సుధని కలుసుకోవాలి. అతను ఊళ్లో లేనప్పుడు జరిగిపోయిందంతా చెబితే అర్థం చేసుకుంటాడు తప్పకుండా. ఇదంతా పెద్దవాళ్ల బలవంతం మీదే జరిగిపోయిందనీ, తను దివాకర్‌కి ఏమాత్రం వశం కాకుండా తప్పించుకున్నానని చెప్పాలి. తన సుధ తనను తప్పక విశ్వసిస్తాడు. తను ఒంటరిగా ఉండటం వల్ల ఈ పెద్దవాళ్లకి తలొంచాల్సి వచ్చింది. కాని సుధాకర్ ప్రక్కనే ఉంటే ఇల్లా జరిగేదా? తన సుధ అండగా ఉంటే ఏ అడ్డంకుల్నైనా ఎదుర్కోగలదు తను..

హైద్రాబాదు రాంగానే సుధాకర్‌కి ఫోన్ చేసింది నీరజ. ఇంకా బొంబాయిలో ట్రైనింగ్ పూర్తయినట్లు లేదు. మరో పదిరోజులకి వస్తాడని చెప్పారు వాళ్ల ఆఫీసు కొలీగ్ ఒకరు. ఎలా గడపాలి సుధాకర్‌కి ఈ విషయం చెప్పకుండా పదిరోజులు! తను చెప్పకముందే ఈ సంగతి సుధకి తెలిసిపోదు గదా! అప్పుడు తనని తప్పుగా అర్థం చేసుకుంటాడేమో! ఛీ! తన సుధ అలాంటివాడు కాదు. తనని కనుక్కోకుండా ఏ నిర్ణయం తీసుకోడు. అసలు రాంగానే తనకి ఫోనుచేసి గాని ఇంకెవరితోనూ మాట్లాడడు గదా! ఇంకెలా తెలుస్తుంది తను చెప్పకముందు! హమ్మయ్య! అని ఊపిరి పీల్చుకుంది.

ఆఫీసుకెళ్లి వస్తోందే గాని మనస్సు ఇంకా ఆందోళన పడుతూనే ఉంది., తన సుధ రాంగానే అతని ఒళ్లో తలపెట్టుకుని అన్ని విషయాలూ అతనికి చెప్పేయాలి. ఇంకా బోలెడు కబుర్లు చెప్పుకోవాలి! ఊహల్లో తేలిపోతోంది నీరజ.

ఓరోజు ఆఫీసులో పన్లో ఉండగా ఫోనొచ్చింది నీరజకి.

"హల్లో నీరజా!"

ఎంత తియ్యటి గొంతు! తన సుధ వచ్చేశాడు.

'బాగున్నావా? రేపు కలుస్తా' అని ఫోను పెట్టేశాడు.

బహుశా ప్రయాణం బడలికలో ఉండుంటాడు. రేపు ఎన్నో కబుర్లు చెప్పుకోవాలి.

'అయితే... సుధాకర్‌కి ఈ విషయం తెలిసే ఉంటుందా ఈపాటికి?..'

తెలిసినా ఫరవాలేదు. ఎలా అయినా తను సర్దిచెప్పగలదు. తనకున్న తెగింపు అతనికుండదా! సుధాకర్ చేతుల్తోనే ఇదంతా మరిపించి తమ అనుబంధానికి గుర్తుగా క్రొత్త బంధం వెయ్యగలడు."

* * *

సుధాకర్ తన బర్త్‌డేకి ప్రెజెంటుగా తెచ్చిన చీరకట్టుకుని అతనికిష్టమైన తెల్లగులాబీ జడలో

పెట్టుకుని అందంగా అలంకరించుకుంది నీరజ. అతనికోసం ఎదురుచూస్తూ కూర్చుంది సుధాకర్ వస్తానన్న వేళకి.

గది తలుపు నెమ్మదిగా తట్టిన శబ్దం. 'సందేహం లేదు. తన సుధే! తనకు బాగా తెలుసు ఆ చప్పుడు. తనకోసం ఆత్రంగా వచ్చేశాడు.'

పట్టలేని ఆందంతో తలుపు తెరిచింది.

ఎప్పుడూ లేనిది చాలా చనువుగా వచ్చి తన మంచం మీద కూర్చున్నాడు. నీరజను కూడా పక్కకొచ్చి కూర్చోమని సైగ చేశాడు. ఎంతటి కమ్మటి అనుభూతి!

తన బొంబాయి ట్రైనింగు కబుర్లన్నీ అయ్యాక, ఇక ఆగలేక నీరజ సుధాకర్ చెయ్యి పట్టుకుని

"సుధా! నా సుధా! నువ్వు నన్నర్థం చేసుకుంటావు గదూ!" అంటూ ప్రారంభించింది గోముగా.

"నేనెప్పుడూ నీ సుధనే! నీరజా! నాకంతా తెలుసునమ్మా!"

అదిరిపోయిందా మాటకి నీరజ. "ఏమిటలా మాట్లాడుతున్నామ్ సుధా నువ్వుకూడా! పెళ్ళంటే పెద్దల బలవంతం మీద చేసుకోక తప్పలేదు గానీ నీకోసం అతనికి ఏమీ కాకుండా మిగిలాను సుధా! మనం ఎప్పటిలాగా ప్రేమతో జీవితాలు ఒక్కటి చేసుకుందాం.."

"నువ్వు చాలా పొరబడుతున్నావ్ నీరజా! మన హృదయాల్లో ఉన్న అనుబంధాలు ఎప్పటికీ మాసిపోయేవి కావు. మనం వివాహంతో ప్రణయమూర్తులం కావాలనుకున్నాం. విధి మన అనురాగాన్ని ఆలానే ఉంచి అనుబంధాన్ని మాత్రం కొద్దిగా మార్చింది. ప్రేమంటే నీకు తెలియంది కాదు. అది హృదయాల్ని దగ్గరకు తెచ్చేదే కాని శరీరాల్ని దగ్గరకు తేనక్కర్లేదు. అందుకే మన అనుబంధాన్ని రూపం మార్చి ఒక్కసారి ప్రేమతో 'అన్నయ్యా!' అని పిలవ్వూ!" జాలిగా అర్థించాడు సుధాకర్ చేతులు పట్టుకుని.

"పరిస్థితులకి రాజీపడి ఇలా అందరం ఆత్మవంచన చేసుకోవాల్సిందేనంటావా?" ఆవేదనతో అడిగింది అతని చేతులోనించి తన చెయ్యి తీసుకుంటూ. ఎందుకో మరి, ఆ క్షణమే ఆమె మనోఫలకం మీద దివాకర్ బొమ్మ పడింది.

"అవును నీరజా! దివాకర్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండు. పెళ్ళి చూపులప్పుడు నువ్వు వాడికి చాలా నచ్చావనీ, నువ్వుకూడా అభ్యంతరం చెప్పలేదనీ, అతని మనసంతా నీకంకితం చేశాననీ, నీతోడిదే లోకం అనీ వాడు రాశాడు. నాకు. నాకంటె ఎక్కువగా ఆరాధించేవాడు దొరికినందుకు నా నీరూ ఎంత అదృష్టవంతురాలో- అనుకున్నా. తనని అంత ప్రేమతో, అనురాగంతో చూసుకునే భర్త దొరకడం! అదీ నా క్లోజ్ ఫ్రెండ్ అవడం! అని ఎంతో మురిసిపోయా. అందుకే మీ పెళ్ళికి ఏవిధంగానూ అడ్డం రాకూడదని నా ఆఫీసుపని మరో నెల్లాళ్ళు పొడిగించుకుని బొంబాయిలోనే ఉండిపోయా."

"కాని... మీ తొలినాటి విషయాలు వాడు రాస్తే ఎంత బాధపడ్డానో! నా గుండెలు పగిలిపోయాయి ఆవేదనతో! వాడి మంచితనం, నీ అందం ఒక్కటి కావాలి! వాడి జీవితం నరకం కాకూడదు నీరజా! అదే నిన్ను కోరేది నేను! అంత ఉత్తముడికి ఇల్లాలయినందుకు నువ్వు తప్పక గర్విస్తావు త్వరలోనే! అతని బ్రతుకును బంగారం చెయ్యి చెల్లెమ్మా!" దీనంగా చేతులు పట్టుకుని అడుగుతున్న సుధాకర్‌ని చూస్తూ అవాక్కయి అలా నిలుచుండిపోయింది నీరజ!

ఆలోచనలో పడింది! వాళ్లెంత ఎదిగిపోయారు ఒక్కసారిగా! తనెంత క్రిందకు పడిపోయింది వీళ్లిద్దరి ముందూ! వాళ్ల సంస్కారం, మంచితనం, త్యాగం తలుచుకుంటే... నోట మాట రాలేదు కాస్సేపు నీరజకి. ఒక నిర్ణయానికొచ్చేసింది.

"అలాగే అన్నయ్యా!నీ నీరజ చల్లని చంద్రునికి చెల్లెలు. వెచ్చని సూర్యునికి ఇల్లాలు. నిర్మలమైన ప్రేమ సరోవరంలో విరిసిన నీరజం ఇక ఆ దివాకరుని వలపుల కిరణాల్లోనే కిలకిలా నవ్వుతుంది." హాయిగా నిట్టూర్చింది నీరజ.

"విఫలప్రేమ అంటూ జీవితాన్ని దుఃఖాల పాలు చేసుకునే ప్రవృత్తి పోవాలి. హృదయాల్లోని ప్రేమాభిమానాలకి సరియైన నిర్వచనం చెప్పుకోవాల్సిన రోజులొచ్చాయి. అప్పుడిక లైలా మజ్నూ కథలుండవమ్మా...!"

నీరజలో కలిగిన మార్పుకి లోలోపలే సంతోషించి, దివాకర్ జీవితాన్ని సుఖమయం చేయగలిగినందుకు గర్విస్తూ

"వెళ్లొస్తానమ్మా!" అంటూ బైటకు నడిచాడు సుధాకర్.

'ఎంత ఎదిగిపోయాడు సుధాకర్ తన త్యాగంతో! ఇంకా నయం! దివాకర్ మంచితనం తనని ఎంత కాపాడిందో!' అనుకుంటూ తృప్తిగా పెన్నూ, కాగితం తీసుకుంది దివాకర్‌కి తన భావాల్ని తెలియజేద్దామని.

●

("తెలుగు పలుకు"ఆస్ట్రేలియా తెలుగు పత్రిక : జనవరి, మార్చి 1994)